కేంద్ర ద్రవ్య లోటు రూ.9.07 లక్షల కోట్లు

ముంబై, డిసెంబర్ 29: కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు ఈ ఏడాది నవంబర్ చివరినాటికి రూ.9.07 లక్షల కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించుకున్న అంచనాల్లో ఇది 50.9 శాతం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ మధ్య నెలల్లో ప్రభుత్వ వసూళ్లు రూ.17.46 లక్షల కోట్లుకాగా, మొత్తం వ్యయం రూ.26.52 లక్షల కోట్లకు చేరుకుందని శుక్రవారం విడుదలైన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల మధ్య ఏర్పడే వ్యత్యాసాన్నే ద్రవ్యలోటుగా వ్యవహరిస్తారు. బడ్జెట్ అంచనాల్లో నవంబర్‌కల్లా 64.3 శాతం వసూళ్లు జరిగాయి. వ్యయం 58.9 శాతంగా నమోదయ్యింది. నిరుడుతో పోలిస్తే వసూళ్లు 64.1 శాతం నుంచి పెరగ్గా, వ్యయాలు 61.9 శాతం నుంచి తగ్గాయి. రెవిన్యూ వసూళ్లలో 14.36 లక్షల కోట్లు పన్నుల ద్వారా సమకూరింది. మిగిలింది పన్నుయేతర ఆదాయంగా లభించింది. ఇది నిరుడుతో పోలిస్తే భారీగా పెరిగింది. రిజర్వ్‌బ్యాంక్ కేంద్రానికి రూ.87,416 కోట్లు బదిలీ చేయడంతోనే పన్నుయేతర ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచుకున్నది. ఇక వ్యయాల్లో కేంద్రం ప్రధానంగా రూ.2.43 లక్షల కోట్లు ఆహార, ఎరువులు, పెట్రోలియం సబ్సిడీల కోసం ఖర్చుచేసింది. అయితే ఇప్పటివరకూ సబ్సిడీలకు అయిన వ్యయం పూర్తి సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపుతో పోలిస్తే 65 శాతమే.

సుకన్య స్కీంపై వడ్డీ పెంపు

మూడేండ్ల డిపాజిట్లపై 20 బేసిస్ పాయింట్ల వరకు సవరింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: చిన్న మొత్తాలపై కేంద్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. సుకన్య సమృద్ధి స్కీంపై వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు పెంచిన కేంద్ర సర్కార్..మూడేండ్ల కాలపరిమితి కలిగిన టర్మ్ డిపాజిట్ స్కీంపై వడ్డీని 10 బేసిస్ పాయింట్లు సవరించింది. ఈ పెరిగిన వడ్డీరేట్లు జనవరి-మార్చి త్రైమాసికానికి వర్తించనున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యూలర్‌లో పేర్కొంది. దీంతో సుకన్య సమృద్ధి స్కీంపై వడ్డీరేటు 8 శాతం నుంచి 8.2 శాతానికి చేరుకున్నది. అలాగే మూడేండ్ల టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటు కూడా 7 శాతం నుంచి 7.10 శాతానికి చేరింది.

మిగతా యథాతథం..

ప్రతి మూడు నెలలకొకసారి చిన్న మొత్తాలపై వడ్డీరేటును సవరిస్తున్న కేంద్రం..ఈసారి మాత్రం రెండు పథకాలపై వడ్డీరేట్లను సవరించింది. మిగతా స్కీంలపై వడ్డీని యథాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో ప్రజాదరణ పొందిన పీపీఎఫ్, పొదుపు డిపాజిట్లపై వడ్డీరేట్లు యథాతథంగా ఉన్నాయి. పీపీఎఫ్ రేటు 7.1 శాతంగాను, పొదుపు డిపాజిట్లపై వడ్డీరేటు 4 శాతం వద్ద స్థిరంగా ఉన్నది. డిసెంబర్ త్రైమాసికంలోనూ ఇదే రేట్లు కొనసాగాయి. అలాగే 115 నెలల్లో మెచ్యూర్ అయ్యే కిసాన్ వికాస్ పత్రాలపై 7.5 శాతం వడ్డీరేటును, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్‌పై 7.7 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. మంత్లీ ఇన్‌కం స్కీంపై 7.4 శాతం వడ్డీ ఇస్తున్నది.

డిపాజిట్లపై రేట్లను పెంచిన బీవోబీ

బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ బాటలోనే బీవోబీ కూడా డిపాజిట్లపై వడ్డీని 125 బేసిస్ పాయింట్ల వరకు సవరించింది. రూ.2 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్ల నుంచి 125 బేసిస్ పాయింట్ల వరకు పెంచుతున్నట్లు బీవోబీ ఒక ప్రకటనలో వెల్లడించింది. 7 రోజుల నుంచి 14 రోజుల లోపు కాలపరిమితి కలిగిన టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటును 125 బేసిస్ పాయింట్లు పెంచడంతో వడ్డీరేటు 3 శాతం నుంచి 4.25 శాతానికి చేరుకున్నది. అలాగే 15 రోజుల నుంచి 45 రోజుల్లోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీరేటు 100 బేసిస్ పాయింట్లు సవరించడంతో రేటు 4.50 శాతానికి చేరింది. స్వల్పకాలిక డిపాజిట్లు ముఖ్యంగా ఏడాది లోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీరేట్లను సవరించినట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి.

బాలీవుడ్ నటి దీపిక పదుకొణేను ప్రచారకర్తగా నియమించుకున్నది ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్. అంతర్జాతీయ ఐకాన్ దీపిక పదుకొణే బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులవడం చాలా సంతోషంగా ఉన్నదని, ఆమె చార్మ్‌తో సంస్థ మరింత పురోభివృద్ధి సాధిస్తుందని హ్యుందాయ్ మోటర్ సీవోవో తరుణ్ గ్యాంగ్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దేశీయ ఆటోమొబైల్ రంగంలో ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తున్న హ్యుందాయ్‌తో చేతులు కలపడం చాలా సంతోషంగా ఉన్నదని దీపిక పదుకొణే వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌లో సిగ్నిటీ మరో సెంటర్

40 వేల చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 29: ప్రముఖ డిజిటల్ ఇంజినీరింగ్ సేవల సంస్థ సిగ్నిటీ టెక్నాలజీస్..హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో ఆఫ్‌షోర్ డెలివరీ సెంటర్‌ను ప్రారంభించింది. 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను కంపెనీ చైర్మన్ సీవీ సుబ్రమణ్యం, కంపెనీ సీఈవో శ్రీకాంత్ చకిలం శుక్రవారం ప్రారంభించారు. 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కలిగిన ఆఫీస్‌కు అదనంగా ఏర్పాటు చేసిన ఈ నూతన సెంటర్‌లో 400 మంది సిబ్బంది కూర్చోవడానికి వీలుంటుందని కంపెనీ సీఈవో శ్రీకాంత్ తెలిపారు. సరికొత్త ఆవిష్కరణలకు ఈ అత్యాధునిక సెంటర్‌ను ప్రారంభించినట్టు, సమీప భవిష్యత్తులో డిజిటల్ కేంద్రాన్ని కూడా జతపరచనున్నట్లు చెప్పారు. ఈ విస్తరణతో సామర్థ్యాలను పెంపొందించడమే కాకుండా ఉద్యోగులకు ప్రపంచ స్థాయి పని వాతావరణాన్ని కల్పించడానికి పలు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

సెటిల్‌మెంట్‌లో ఎల్ఐసీ టాప్

- **98.5 శాతం క్లెయింలు పరిష్కరించిన బిగ్గజం**

ముంబై, డిసెంబర్ 29: బీమా క్లెయింల పరిష్కారంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) అగ్రస్థానంలో ఉంది. 2023 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ 98.5 క్లెయింలను సెటిల్ చేసినట్టు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏ) వెల్లడించింది. అయితే అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఎల్ఐసీ సెటిల్‌మెంట్ నిష్పత్తి 98.7 శాతం నుంచి స్వల్పంగా తగ్గింది. ఐఆర్‌డీఏ తాజాగా విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం ప్రైవేటు జీవితబీమా సంస్థల సెటిల్‌మెంట్ రేషియో సైతం 98.1 శాతం నుంచి 98 శాతానికి దిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 12.5 లక్షల క్లెయింలు రాగా, బీమా కంపెనీలు 12.4 లక్షల క్లెయింలు పరిష్కరించాయి. గ్రూప్ క్లెయింల్లో ఎల్ఐసీ దాదాపు 99 శాతం సెటిల్ చేసింది. ప్రైవేటు సంస్థలు 99.4 శాతం సెటిల్ చేశాయి. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో జీవిత బీమా వ్యాపారంలో సరెండర్లు/విత్‌డ్రాయిల్స్ 25.6 శాతం పెరిగి రూ. 2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వీటిలో ఎల్ఐసీ చెల్లించినవే 56.3 శాతం పాలసీలు ఉన్నాయి. మొత్తం జీవిత బీమా పరిశ్రమ పాలసీదార్లకు చెల్లించిన ప్రయోజనాల విలువ రూ. 5 లక్షల కోట్ల వరకూ ఉన్నది. ఇది నికర ప్రీమియం ఆదాయంలో 64 శాతం. వ్యక్తిగత జీవిత బీమా వ్యాపారంలో 10.8 లక్షల డెత్ క్లెయింలు రాగా, కంపెనీలు 10.6 లక్షల క్లెయింలను పరిష్కరించి రూ. 28,611 కోట్లు చెల్లించాయి.

బెంగాల్ కోల్డ్ రోలర్స్ డైరెక్టర్ అరెస్టు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ చెల్లించకుండా, రూ.5 కోట్ల మేర మోసం చేసిన బెంగాల్ కోల్డ్ రోలర్స్ కంపెనీ డైరెక్టర్లలో ఒకరిని అరెస్ట్ చేసినట్టు రాష్ట్ర కమర్షియల్ ట్యాక్స్ విభాగం తెలిపింది. సరైన పత్రాలు లేకుండానే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందిందనే ఆరోపణలపై అధికారులు కేసు నమోదు చేశారు. ఈ నెల 26వ తేదీన తిమ్మాపూర్‌లోని కంపెనీలో, సంస్థ డైరెక్టర్ల ఇండ్లలో సోదాలు చేయగా నకిలీ స్లిప్పులు, అకౌంట్ పుస్తకాలు బయటపడ్డాయని అధికారులు తెలిపారు. వాటిని పరిశీలించగా ప్రాథమికంగా రూ.5 కోట్ల మేర మోసం చేశారని తేలిందని, ఇది మరింత ఎక్కువగా ఉండొచ్చన్నారు. ఈ మేరకు కంపెనీ డైరెక్టర్ సౌరబ్ అగర్వాల్‌ను అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరుచగా 13 రోజుల కస్టడీ విధించినట్టు చెప్పారు. కంపెనీ ఎండీ రామౌథర్ అగర్వాల్ పరారీలో ఉన్నట్టు చెప్పారు.

మరింత పెరిగిన విదేశీ మారక నిల్వలు

ముంబై, డిసెంబర్ 29: దేశం వద్దనున్న విదేశీ మారక నిల్వలు (ఫారెక్స్) వరుసగా మూడో వారమూ పెరిగాయి. డిసెంబర్ 22తో ముగిసిన వారంలో ఇవి మరో 4.47 బిలియన్ డాలర్ల మేర పెరిగి 620.44 బిలియన్ డాలర్ల స్థాయికి చేరినట్టు రిజర్వ్‌బ్యాంక్ శుక్రవారం తెలిపింది. అంతక్రితం వారంలో ఇవి 9.11 బిలియన్ డాలర్ల మేర పెరిగాయి. 2021 అక్టోబర్‌లో 645 బిలియన్ డాలర్ల రికార్డుస్థాయికి చేరిన తర్వాత మళ్లీ ఆ స్థాయికి నిల్వలు కోలుకోలేదు. ఒకదశలో ఇవి 520 బిలియన్ డాలర్ల వద్దకు పడిపోయాయి. అటు తర్వాత క్రమేపీ కోలుకుని రికార్డుస్థాయిని సమీపిస్తున్నాయి. గత నెలరోజులుగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) స్టాక్ మార్కెట్లో డాలర్లు కుమ్మరించడం ఫారెక్స్ నిల్వలు పెరగడానికి ప్రధాన కారణమని డీలర్లు తెలిపారు.ఈ ఏడాది మొత్తంమీద రిజర్వ్‌బ్యాంక్ 51.26 బిలియన్ డాలర్ల నిల్వల్ని పెంచుకుంది. ఈ డిసెంబర్ 22తో ముగిసిన వారంలో విదేశీ నిల్వల్లో అధికభాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు ఏకంగా 4.898 బిలియన్ డాలర్లు పెరిగి 549.75 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్ మారకంలో వెల్లడించే విదేశీ కరెన్సీ ఆస్తుల్లో..అమెరికాయేతర కరెన్సీలయిన యూరో, పౌండ్, యెన్‌ల విలువల్లో ఏర్పడిన పెరుగుదల లేదా తరుగుదలను పరిగణనలోకి తీసుకుంటారు.

బంగారం నిల్వల్లో తరుగు

సమీక్షా వారంలో రిజర్వ్‌బ్యాంక్ వద్దనున్న బంగారం నిల్వలు మాత్రం తరిగిపోయాయి. ఇవి 107 మిలియన్ డాలర్ల మేర క్షీణించి

47.474 బిలియన్ డాలర్లకు తగ్గినట్టు ఆర్బీఐ తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్‌లు) 4 మిలియన్ డాలర్లు పెరిగి 18.33 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్ వద్ద ఉంచిన రిజర్వుల విలువ 129 మిలియన్ డాలర్లు తగ్గి 4.894 బిలియన్ డాలర్ల వద్ద నిలిచాయి.

కీలక రంగాల్లో 7.8 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: కీలక రంగాలు మళ్లీ పుంజుకున్నాయి. నవంబర్ నెలకుగాను ఎనిమిది కీలక రంగాల్లో 7.8 శాతం వృద్ధి నమోదైందని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వృద్ధి 5.7 శాతంగా ఉన్నది. బొగ్గు, రిఫైనరీ ఉత్పత్తులు రికార్డు స్థాయిలో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషం. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో కీలక రంగాలు 8.6 శాతం వృద్ధిని కనబరిచాయి.

భీమా జ్యూవెల్స్ ప్రచారకర్తగా శోభితా ధూళిపాల

హైదరాబాద్, డిసెంబర్ 29: ఆభరణాల విక్రయ సంస్థ భీమా జ్యూవెల్స్ ప్రచారకర్తగా ప్రముఖ నటి శోభితా ధూళిపాల నియమితులయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ అభిశేక్ బిందుమాధవ్ మాట్లాడుతూ..ఆభరణాల మార్కెట్లో బ్రాండ్‌కు మరింత ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో శోభితా ధూళిపాలను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సంస్థకు భారత్‌తోపాటు యూఏఈలో 60కి పైగా స్టోర్లు ఉన్నాయి.

రేపటివరకూ ఫైన్‌తో ఐటీఆర్ ఫైలింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: నిర్ణీత గడువు తేదీ జూలై 31నాటికి ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలు చేయనివారికి మరో చివరి అవకాశం ఉన్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రిటర్న్‌ను డిసెంబర్ 31కల్లా తగిన జరిమానా చెల్లించి ఫైల్ చేసుకోవచ్చు. గడువు తేదీని మిస్ అయినవారు 2023 డిసెంబర్ 31నాటికి ఫైల్ చేయాల్సిందేనని ఆదాయపు పన్ను శాఖ తాజాగా ఎక్స్‌లో చేసిన పోస్టులో హెచ్చరించింది. ఆలస్యం చేసిన లేదా సరిదిద్దిన రిటర్న్‌లను సమర్పించడానికి ఇదే చివరి అవకాశమని తెలిపింది. రూ. 5 లక్షల వార్షిక ఆదాయంగలవారు ఆలస్యంగా రిటర్న్ ఫైల్ చేస్తే రూ. 1,000, ఆపైన ఆదాయం ఉన్నవారు రూ. 5,000 ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది. గడువులోగా సమర్పించిన రిటర్న్‌ను మళ్లీ సరిదిద్దుకుని ఫైల్ చేసేవారికి ఫైన్ ఉండదు. ఆదాయపు పన్నును చెల్లించాల్సి ఉంటేమాత్రం దానికి నెలకు 1 శాతం చొప్పున అపరాధ వడ్డీని కలపి కట్టాలి.

రాష్ట్రంలో పెరిగిన డిపాజిట్లు, రుణాలు

ఎస్ఎల్‌బీసీ 39వ త్రైమాసిక సమీక్షా సమావేశం

హైదరాబాద్, డిసెంబర్ 29: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో తెలంగాణలోని బ్యాంకుల డిపాజిట్లు రూ.52,153 కోట్లు వృద్ధి చెందితే, రుణాలు రూ.99,283 కోట్లు పెరిగాయి. శుక్రవారం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ఈ జూలై-సెప్టెంబర్‌కుగాను 39వ త్రైమాసిక సమీక్షా సమావేశాన్ని ఇక్కడ నిర్వహించింది. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ ఏప్రిల్-సెప్టెంబర్‌లో బ్యాంకుల పనితీరును వివరించారు. సీడీ రేషియో 124.22 శాతంగా ఉందని, స్వల్పకాలిక ఉత్పాదక రుణాలు 79.48 శాతం ఎగిసి రూ.35,023 కోట్లకు చేరాయన్నారు. వ్యవసాయ రంగానికి పెట్టుబడి సాయంగా రూ.26,730 కోట్ల రుణాలు ఇచ్చామని, విద్యా రుణాలు రూ.396 కోట్లు, గృహ రుణాలు రూ.1,832 కోట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు రూ.67,723 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఇక ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం కింద రూ.4,485 కోట్ల రుణాలు బ్యాంకులిచ్చాయని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని బ్యాంకుల్లో 113.72 లక్షల పీఎంజేడీవై ఖాతాలున్నాయని, ఈ ఖాతాదారులకు 84.75 లక్షల రూపే కార్డులను జారీ చేశామన్నారు. ఇక 17.57 లక్షల కస్టమర్లు అటల్ పెన్షన్ యోజన స్కీమును తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి టీకే శ్రీదేవి, ఆర్బీఐ ప్రాంతీయ డైరెక్టర్ కే నిఖిల, నాబార్డు సీజీఎం సీహెచ్ సుశీల, ఎస్ఎల్‌బీసీ తెలంగాణ కన్వీనర్, ఎస్బీఐ జీఎం దేబాశిష్ మిత్రా తదితరులు పాల్గొన్నారు.

పైసా వసూల్..

ఈ ఏడాది బుల్ రన్ భళా

రికార్డులతో హోరెత్తించిన స్టాక్ మార్కెట్లు

11,400 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్

ఆల్‌టైమ్ హైకి మదుపరుల సంపద

రూ.81.90 లక్షల కోట్లు ఎగబాకిన మార్కెట్ విలువ

దేశీయ స్టాక్ మార్కెట్లను 2023 హుషారెత్తించింది.

> **మదుపరులు పెట్టుబడులతో శివమెత్తడంతో సూచీలు సరికొత్త స్థాయిలను అధిరోహించాయి.**

బీఎస్ఈ మార్కెట్ విలువ సైతం మునుపెన్నడూ లేనివిధంగా రూ.364 లక్షల కోట్లను దాటేసింది. కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు, జీడీపీ వృద్ధి ర్యాలీకి దోహదం చేశాయి.

ముంబై, డిసెంబర్ 29: భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలో 2023 ప్రత్యేకంగా నిలిచిపోయింది. ఆల్‌టైమ్ హై రికార్డులతో సూచీలు అదరగొట్టాయి. మదుపరులు పెట్టుబడులకు పెద్దపీట వేయగా, ఆయా షేర్లు కాసుల వర్షం కురిపించాయి. ఈ ఏడాది బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఏకంగా 11,399.52 పాయింట్లు (18.73 శాతం) ఎగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 3,626.10 పాయింట్లు (20 శాతం) పుంజుకున్నది. ఈ నేపథ్యంలోనే బీఎస్ఈలో నమోదైన సంస్థల మార్కెట్ విలువ ప్రస్తుతం రూ.3,64,28,846.25 కోట్ల వద్ద ఉన్నది. గత ఏడాది ముగింపుతో పోల్చితే రూ.81,90,598.32 కోట్లు పెరిగినట్టు తేలింది. దేశ స్థూల ఆర్థిక మూలాలు బలంగా ఉండటం, జీడీపీ గణాంకాలు ఆకర్షణీయంగా నమోదు కావడం, రాజకీయ సుస్థిరత కలిసొచ్చాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అలాగే వచ్చే ఏడాది నుంచి వడ్డీ రేట్ల కోతలకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ సంకేతాలివ్వడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చిందని అంటున్నారు.

ఒడిదుడుకుల్లో పయనం..

ఈ ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకే లోనయ్యాయి. మదుపరులు అమ్మకాలు-కొనుగోళ్ల మధ్య ఊగిసలాడారు. చివరకు పెట్టుబడులకే ప్రాధాన్యతనివ్వడంతో సూచీలు సరికొత్త శిఖరాలను అధిరోహించగలిగాయి. ఇక ద్రవ్యోల్బణం, అమెరికా బాండ్ ఈల్డ్స్, చైనా రియల్ ఎస్టేట్ సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-గాజా దాడులుసహా ఇతరత్రా రాజకీయ భౌగోళిక ఆందోళనలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు-ఉపసంహరణలు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్రవ్య విధానాలు, రూపాయి మారకం విలువ.. దేశీయ స్టాక్ మార్కెట్ కదలికల్ని ఈ ఏడాదంతా ఎక్కువగా ప్రభావితం చేశాయి.

జోరుగా ఐపీవోలు

ఈ ఏడాది స్టాక్ మార్కెట్లలోకి ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) జోరుగా వచ్చాయి. దీంతో 2023లో వచ్చిన ఐపీవోలు మొత్తం 57గా నమోదయ్యాయి. 2021 (63 ఐపీవోలు) తర్వాత గడిచిన దశాబ్ద కాలంలో ఈ స్థాయిలో ఐపీవోలు రావడం ఇదే తొలిసారి. ఒక్క డిసెంబర్‌లోనే 12 ఐపీవోలు రావడం గమనార్హం. ఇక ఈ ఏడాది ఐపీవోల్లో ఆయా సంస్థలు దాదాపు రూ.49,000 కోట్ల నిధులను సమీకరించాయి. వీటిలో టాటా టెక్నాలజీస్, ఐడియాఫోర్జ్ వంటి ప్రముఖ సంస్థలూ ఉన్నాయి. కాగా, వచ్చే ఏడాదీ భారీ ఎత్తునే ఐపీవోలు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024లో 60కిపైగానే ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు రావచ్చన్న అంచనాలున్నాయి.

నష్టాలతో వీడ్కోలు

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ ఏడాదికి నష్టాలతో వీడ్కోలు పలికాయి. 2023లో ట్రేడింగ్‌కు చివరి రోజైన శుక్రవారం సెన్సెక్స్ 170.12 పాయింట్లు లేదా 0.23 శాతం పడిపోయి 72,240.26 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 327.74 పాయింట్లు నష్టపోయినా.. తిరిగి కోలుకున్నది. నిఫ్టీ సైతం 47.30 పాయింట్లు లేదా 0.22 శాతం క్షీణించి 21,731.40 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 101.8 పాయింట్లు పతనమైనా.. ఆ తర్వాత తేరుకున్నది. నిజానికి ఉదయం ఆరంభం నుంచీ సూచీలు నీరసంగానే ట్రేడ్ అయ్యాయి. మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. ఎనర్జీ, బ్యాంకింగ్, ఐటీ రంగాల షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. సెన్సెక్స్‌లో ఎస్బీఐ, ఇన్ఫోసిస్, టైటాన్, టెక్ మహీంద్రా, ఇండస్ఇండ్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు ప్రధానంగా నిరాశపర్చాయి. రంగాలవారీగా చమురు-గ్యాస్, బ్యాంకింగ్, ఐటీ, టెక్నాలజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు 1.10 శాతం నుంచి 0.05 శాతం వరకు కోల్పోయాయి. కాగా, బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.85 శాతం, స్మాల్‌క్యాప్ 0.69 శాతం చొప్పున పెరిగాయి. ఇక ఈ వారం మొత్తంగా చూసినట్టైతే సెన్సెక్స్ 1,133.3 పాయింట్లు (1.59 శాతం), నిఫ్టీ 382 పాయింట్లు (1.78 శాతం) పెరిగాయి. ఇక వరుసగా ఐదు రోజులు లాభాలు రావడంతో గురువారం సెన్సెక్స్ 72,410.38 పాయింట్ల ఆల్‌టైమ్ క్లోజింగ్ హై రికార్డును నెలకొల్పిన విషయం తెలిసిందే. నిఫ్టీ కూడా 21,778.70 పాయింట్ల సరికొత్త స్థాయి వద్ద నిలిచింది.

వడ్డీరేట్ల పెంపునకు ఆర్బీఐ విరామం ఇవ్వడం మదుపరులను ఉత్సాహపర్చింది. దేశ జీడీపీ గణాంకాలు కూడా మార్కెట్లను లాభాల్లో నడిపించాయి.

-సంపత్ రెడ్డి,
బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఐవో

దేశ ఆర్థిక వృద్ధి పరుగులు పెడుతుండటం, కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు ఆకర్షణీయంగా నమోదవడం మార్కెట్ ర్యాలీకి దోహదం చేసింది.

-వీకే విజయకుమార్,
జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఐఎస్

2024 కూడా దేశీయ స్టాక్ మార్కెట్లకు ఫుల్ జోష్‌నిస్తుందని నమ్మవచ్చు. అటు అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపులు, ఇటు ఆర్బీఐ రెపో కోతలు కలిసి రాగలవు.

-సునీల్ న్యాతీ,
స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ

- **ఈ ఏడాదిలో డిసెంబర్ 28న సెన్సెక్స్ తొలిసారి 72,484.34 పాయింట్లను తాకి ఆల్‌టైమ్ హై ఇంట్రా-డే రికార్డును నెలకొల్పింది. అలాగే మార్చి 20న 57,084.91 పాయింట్లకు పడిపోయి 52 వారాల కనిష్ఠాన్ని చేరింది.**
- **2021 మే 24న 3 లక్షల కోట్ల డాలర్ల మార్కును తాకిన బీఎస్ఈ ఎం-క్యాప్. ఈ ఏడాది నవంబర్ 29న 4 లక్షల కోట్ల డాలర్లకు చేరిక. రెండున్నరేండ్ల లోనే లక్ష కోట్ల డాలర్లు పెరిగిన విలువ.**
- **ఈ ఏడాది రూ.81.90 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద. గత ఏడాది రూ.16.38 లక్షల కోట్లకే పరిమితం.**
- **2022లో 2,586.92 పాయింట్లు (4.44 శాతం) పెరిగిన సెన్సెక్స్. 2023లో ఏకంగా 11,399.52 పాయింట్లు (18.73 శాతం) ఎగబాకిన సూచీ.**
- **ఓవరాల్‌గా ఈ ఏడాది సెన్సెక్స్ 8 నెలలు లాభాలను అందుకోగా, 4 నెలలు నష్టాల్ని మూటగట్టుకున్నది. ఇక డిసెంబర్‌లో సెన్సెక్స్ ర్యాలీ 7.83 శాతంగా నమోదవగా, గత నెల నవంబర్‌లో 4.87 శాతంగానే ఉన్నది. ఈ రెండు నెలలే సెన్సెక్స్ వృద్ధిలో కీలకంగా నిలిచాయి.**
- **ఈ ఏడాది బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 13,746.97 పాయింట్లు (47.52 శాతం), మిడ్‌క్యాప్ సూచీ 11,524.72 పాయింట్లు (45.52 శాతం) పుంజుకున్నాయి. దీంతో చిన్న మదుపరులకూ పెద్ద ప్రయోజనం చేకూరింది.**

బీఎస్ఈ టాప్-5 కంపెనీల మార్కెట్ క్యాప్

సంస్థ	విలువ (రూ. కోట్లలో)
రిలయన్స్ ఇండస్ట్రీస్	17,48,827.92
టీసీఎస్	13,88,591.70
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	12,97,972.04
ఐసీఐసీఐ బ్యాంక్	6,98,965.47
ఇన్ఫోసిస్	6,40,351.80

Printed and Published by **Damodar